


అగ్ర వర్ణ కబంధ హస్తాల్లో

దళిత నియోజకవర్గం

అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..

WANTED రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త

దిన పత్రికలో పని చేయుటకు తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త JV NEWS

ఎడిటర్: బిర్రు కరుణాకర్

Cell:9701249103

సంపుటి - 2 సంచిక - 280 బుధవారం 4 ఫిబ్రవరి 2026 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజీలు -5 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts




# అసంతృప్త నేతలను బుజ్జగించండి

## 'పురపోరు'పై మంత్రులతో సీఎం రేవంత్‌రెడ్డి

**ఎక్కడ వెనుకబడ్డామో గుర్తించండి**

**రోజువారీ రిపోర్టు ఇవ్వండి**

**:నేడు మిర్యాలగూడ నుంచి ఎన్నికల ప్రచారం**

హైదరాబాద్**ఫిబ్రవరి 03 (జర్నలిస్ట్ వార్త):**
'మన పార్టీ ఏయే మున్సిపాల్టీల్లో వెనుకబడి ఉందనే విషయాన్ని వెంటనే గుర్తించండి, అక్కడ వెంటనే రంగంలోకి దిగండి, బలోపేతానికి యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోండిడ' అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రులు, మున్సిపల్ ఎన్నికల బాధ్యులను ఆదేశించారు. టిక్కెట్ రాలేదని అలకబూనిన అసంతృప్త నేతలను బుజ్జగించాలని ఆయన వారికి సూచించారు. క్షేత్రస్థాయి పరిస్థితులపై ఏరోజుకారోజు రిపోర్టును తనకు అందజేయాలని ఆదేశించారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించేందుకు సీఎం రేవంత్ రెడ్డి మంగళవారం సాయంత్రం హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని తన కార్యాలయంలో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఏఐసీసీ ఇంఛార్జి మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, వివిధ పార్లమెంటు నియోజకవర్గాల పరిధిలోని మున్సిపాల్టీలకు బాధ్యులుగా ఉన్న మంత్రులు ఈ భేటీకి హాజరయ్యారు. జిల్లాల్లో నామినేషన్ల ఉపసంహరణమిగతా 2లో...



# సహనానికి దక్కిన విజయం!

## విమర్శలు వచ్చినా ఓర్పుతో సహించాం

అదే ఇప్పుడు మనలను ముందకు తీసుకెళ్లింది

అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై ప్రధాని మోడీ

ఎన్‌డిఎ సమావేశంలో మోడీని సన్మానించిన ఎంపిలు

2లో.



# ట్రంప్ ఒత్తిడికి ప్రధాని తలొగ్గారు

**మోడీ అమెరికాకు అమ్ముడు పోయారు -ఆదానీ కేసులో మోడీకి భయం పట్టుకుంది**

**అమెరికా ట్రేడ్ డీల్‌పై రాహుల్ విమర్శలు**

న్యూఢిల్లీ**ఫిబ్రవరి 03 (జర్నలిస్ట్ వార్త):**
అమెరికా, భారత్ మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందంపై ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ స్పందించారు. ప్రధాని మోదీ అమ్ముడుపోయినట్లు పేర్కొన్నారు. ట్రంప్ వత్తిడికి మోదీ తలొగ్గినట్లు ఆరోపించారు. పార్లమెంట్ ఆవరణలో మీడియాతో రాహుల్ మాట్లాడారు. ఎప్‌స్టీన్ ఫైల్స్ కేసు వల్ల ప్రధాని మోదీ తీవ్ర వత్తిడిలో ఉన్నట్లు ఆరోపించారు. అదానీపై అమెరికాలో కేసు కొనసాగుతున్న నేపథ్యంలో కూడా మోదీ ఆందోళనలో ఉన్నట్లు రాహుల్ పేర్కొన్నారు. మోదీజీ భయపడుతున్నారని, నాలుగు నెలలుగా వాణిజ్య ఒప్పందం స్తంభించిందని, కొన్ని కారణాల తప్ప ఏమీ మారలేదని, నిన్న సాయంత్రం ఒప్పందం కుదుర్చుకున్నారని గాంధీ అన్నారు.మిగతా 2లో...



# వ్యవసాయ కూలీల ట్రాక్టర్ బోల్తా

**నలుగురు మహిళా కూలీలు మృతి**

**పలువురికి తీవ్ర గాయాలు**

**జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలంలో ఘటన**



**మల్లాపూర్,ఫిబ్రవరి 03 (జర్నలిస్ట్ వార్త):**
వ్యవసాయ కూలీ పనికి వెళ్లిన మహిళా కూలీల ట్రాక్టర్ బోల్తా పడటంతో నలుగురు మృతిచెందారు. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలంలో మంగళవారం సాయంత్రం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మల్లాపూర్ మండలంలోని మొగిలిపేట గ్రామానికి చెందిన సుమారు 12 మంది మహిళా కూలీలుమిగతా 2లో...



# 8 మంది కాంగ్రెస్ ఎంపీల సస్పెన్షన్

**లోక్‌సభలో తీవ్ర ఉద్రిక్తత...**

**బడ్జెట్ సమావేశాలు ముగిసే వరకు వేటు వేసిన ఇన్చార్జి స్పీకర్**

**ఛైర్ వైపు కాగితాలు విసిరి, సభకు అంతరాయం కలిగించారని ఆగ్రహం**

**చైనా సరిహద్దు వివాదంపై చర్చకు పట్టుబట్టిన రాహుల్ గాంధీ**

**మాజీ ఆర్మీ చీఫ్ నరవణే పుస్తక ప్రస్తావనపై సభలో వాగ్వాదం**

న్యూఢిల్లీ**ఫిబ్రవరి 03 (జర్నలిస్ట్ వార్త):**
పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో మంగళవారం తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. సభలో ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించి, నిరసన పేరుతో కాగితాలను మిగతా 2లో...



# ప్రకృతి వ్యవసాయ హబ్‌గా ఏపీ

**అమరావతి,ఫిబ్రవరి 03 (జర్నలిస్ట్ వార్త):**
ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుడుతూ, ఏలూరు జిల్లాలో సుమారు 500 ఎకరాల విస్తీర్ణంలో అంతర్జాతీయ స్థాయిలో 'కోకో సిటీ' ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. వ్యవసాయం, దాని అనుబంధ రంగాలపై సచివాలయంలో ఉన్నతాధికారులతో మిగతా 2లో...

**ఏలూరు జిల్లాలో 500 ఎకరాల్లో కోకో సిటీ: సీఎం చంద్రబాబు**

**లంబసింగిలో కుంకుమపువ్వు సాగుకు ప్రణాళిక ఆక్వా సాగు వివరాల నమోదు తప్పనిసరి**

**రైతుల కోసం డిజి రైతు బజార్, కిసాన్ డ్రోన్ యాప్‌ల ప్రారంభం**

# దేశ గోప్యతను అడ్డుకోలేరు

**వాట్సాప్ ప్రైవసీ పాలసీపై విచారణ**

**ఇక్కడి చట్టాలను గౌరవించకుంటే వెళ్లిపోండి**

**మెటా సంస్థ తీరుపై సుప్రీం ఆగ్రహం**




న్యూఢిల్లీ,**ఫిబ్రవరి 03 (జర్నలిస్ట్ వార్త):**
ప్రైవసీ పాలసీ విషయంలో వాట్సప్ మాతృ సంస్థ మెటాపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. మీరు మా దేశ గోప్యతతో ఆడుకోలేరు. మా డేటాలోని ఒక్క అంకెను కూడా పంచుకోవడానికి మేం అనుమతించం.మిగతా 2లో...

# 2 లక్షల ఉద్యోగాలేవి?

## రెండేండ్లుగా నియామకాలపై ముఖం చాటేస్తున్న సీఎం

**రాష్ట్రంలో జీరో రిక్రూట్‌మెంట్**

**సీఎం ముక్కునేలకు రాసినా నిరుద్యోగులు క్షమించరు : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**



**హైదరాబాద్ఫిబ్రవరి 03 (జర్నలిస్ట్ వార్త):**
రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండేండ్లయినా నిరుద్యోగులకు రెండు లక్షల ఉద్యోగాలు అందలేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె తారక రామారావు (కేటీఆర్) విమర్శించారు. అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలిస్తామంటూ కాంగ్రెస్ ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. ఉద్యోగాల భర్తీపై సీఎం రేవంత్‌రెడ్డి ముఖం చాటేస్తున్నారనీ, మాటతప్పినందుకు ఆయన ముక్కు నేలకు రాసినా నిరుద్యోగులు క్షమించరని అన్నారు. ఈ మేరకు మంగళశారం ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. తొలి ఏడాది రెండు లక్షలమిగతా 2లో...




# రోడ్డు నిబంధనలు పాటిస్తామని ప్రతిజ్ఞ

**రోడ్డు ప్రమాదాలను నివారించేలా అవగాహన**

**ప్రతిజ్ఞ వెబ్‌సైట్ ప్రారంభంలో మంత్రి పొన్నం ప్రభాకర్**

హైదరాబాద్,**ఫిబ్రవరి 03 (జర్నలిస్ట్ వార్త):**
రోడ్డు భద్రతా ప్రతిజ్ఞ వెబ్‌సైట్‌ను సచివాలయంలో రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి ప్రారంభించారు. ఇది తెలంగాణలో బాధ్యతాయుతమైన రహదారి ప్రవర్తన సంస్కృతిని నిర్మించే దిశగా ఒక ముఖ్యమైన అడుగును సూచిస్తుంది. పౌరులు, తల్లిదండ్రులనుమిగతా 2లో...

# సహనానికి దక్కిన విజయం!

న్యూఢిల్లీ,ఫిబ్రవరి 03 (జర్నలిస్ట్ వార్త):
ఇంతకాలం సహనంగా ఉన్నందువల్లనే అమెరికాతో వాణిజ్య ఒప్పందం అమనకు అనుకూలంగా మారిందని ప్రధాని మోడీ అన్నారు. ఇది ఓ చారిత్రాత్మక ముందడుగగా ఆయన అభివర్ణించారు. ఎన్ని విమర్శలు వచ్చినా తట్టుకుని ఓర్పుతో ఓపిక పట్టామని అన్నారు. అమెరికాతో భారత్ కుదుర్చుకున్న చారిత్రక వాణిజ్య ఒప్పందంపై ఎన్డీఏ సమావేశంలో ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడారు. భారత్, అమెరికా మధ్య జరిగిన వాణిజ్య ఒప్పందాన్ని(ట్రేడ్ డీల్) 'ఈ శతాబ్దపు అతిపెద్ద ఒప్పందం'గా ప్రధాని మోదీ అభివర్ణించారు. ఇది అంతర్జాతీయంగా పెరుగుతున్న భారత దేశ ప్రాముఖ్యతను మరింత పెంచుతుందని తెలిపారు. మంగళవారం ఎన్డీఏ పార్లమెంటరీ పార్టీ సమావేశానికి ప్రధాని మోదీ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారత్, అమెరికా మధ్య కుదిరిన ట్రేడ్ డీల్ కారణంగా ఇరు దేశాల పరస్పర సుంకాలు ప్రస్తుతం ఉన్న 25 శాతం నుంచి 18 శాతానికి తగ్గాయని వెల్లడించారు. ప్రపంచ వ్యవహారాల్లో, సమతుల్యతను కాపాడుకోవడంలో భారత దేశ పాత్ర మరింత పెరుగుతుందని ఎన్డీఏ ఎంపీలతో ఆయన అన్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిర్ణయంతో కొంతమంది తీవ్ర నిరాశకు గురయ్యారని ప్రతిపక్ష పార్టీలను ఉద్దేశిస్తూ ప్రధాని మోదీ వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధికి, ఎగుమతులు పెరిగేందుకు ఈ ఒప్పందం ఎంతో ఉపకరిస్తుందని ప్రధాని మోదీ వెల్లడించారు. మరోవైపు ఈ సమావేశంలో ఎన్డీఏ ఎంపీలు ప్రధాని నరేంద్ర మోదీని సత్కరించారు. భారత్‌పై అమెరికా విధించిన సుంకాలపై ఎన్ని విమర్శలు వచ్చినా.. సహనంతో ఉన్నానని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఆ సహనమే ఇప్పుడు దేశానికి మంచి ఫలితాలను తీసుకుని వచ్చిందన్నారు. అగ్రరాజ్యంతో చేసుకుంటున్న ఈ ఒప్పందం అనుకూలమైన ఆర్థిక వాతావరణాన్ని సృష్టించిందని వెల్లడించారు. వాణిజ్య చర్చలపై ప్రభుత్వ స్థిరమైన వైఖరికి ఇది నిదర్శనమన్నారు. ప్రపంచ దేశాల మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతల వల్ల ఎన్నో దేశాలు వాణిజ్యపరంగా సమస్యలు ఎదుర్కొంటు న్నప్పటికీ.. భారత్ మాత్రం ప్రయోజనం పొందుతోందన్నారు. దేశంలో పారిశ్రామిక వృద్ధిని బలోపేతం చేయడానికి తమ ప్రభుత్వం నిరంతరం చర్యలు తీసుకుంటోందని మోదీ పేర్కొన్నారు. కొంతకాలంగా అమెరికాతో జరుగుతున్న వాణిజ్య చర్చల్లో అనేక సమస్యలు, ఇబ్బందులు ఎదుర్కొన్నామన్నారు. అయినప్పటికీ తమ ప్రభుత్వం వెనకడుగు వేయలేదన్నారు. గత దశాబ్దకాలంలో దేశంలో చాలా మార్పులు వచ్చాయని, పలు సంస్కరణలు మంచి ఫలితాలను ఇచ్చాయని తెలిపారు. వేగంగా అభివృద్ధి చెందుతోన్న ఆర్థికవ్యవస్థల్లో భారత్ ఒకటిగా నిలిచిందని.. ప్రపంచ వేదికలపై మన ప్రాబల్యం పెరిగిందని వెల్లడించారు. మరికొన్నేళ్లలో ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా భారత్ తప్పకుండా నిలుస్తుందని ధీమా వ్యక్తంచేశారు. అంతకుముందు ఎన్డీఏ భాగస్వామ్య పక్షాల పార్లమెంటరీ పార్టీ భేటీ జరిగింది. పార్లమెంట్ కార్యకలాపాలకు ముందు ఎన్డీఏ ఎంపీలు ప్రధాని నరేంద్ర మోదీని సన్మానించారు. భారత్‌తో ట్రేడ్ డీల్ కు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఓకే చెప్పిన నేపథ్యంలో.. ఒప్పందం కోసం ప్రధాని చేసిన కృషికి గాను ఈ సన్మానం చేశారు. పార్లమెంట్‌లో ప్రతిపక్ష, అధికారపక్ష సభ్యుల మధ్య ప్రతిష్టంభన కొనసాగుతోన్న నేపథ్యంలో ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈ కీలక భేటీ ప్రాధాన్యం సంతరించుకుంది. ఇందులోభాగంగా ప్రతిపక్షాల విమర్శలపై స్పందనలు, పార్లమెంట్‌లో అనుసరించాల్సిన వ్యూహాలపై ప్రధాని మోదీ ఎంపీలకు దిశానిర్దేశం చేసారు.

-------------

# 2 లక్షల ఉద్యోగాలేవి?

(మొదటి పేజి తరువాయి)
నియామకాలు చేపట్టకపోతే ప్రభుత్వాన్ని దించేయం డని ఢిల్లీ నుంచి వచ్చి మరీ చెప్పిపోయిన ప్రియాంక గాంధీ మాట అమలై ఉంటే, రేవంత్ సర్కారు కుప్పకూలి ఇప్పటికే ఏడాది పూర్తయ్యేదని విమర్శిం చారు. కేసీఆర్ హయాంలో చివరి దశలో ఉన్న 65 వేల ఉద్యోగాలకు నియామక పత్రాలు ఇచ్చి, ఫొటోలకు ఫోజులు కొట్టిన సీఎం, ఆ తర్వాత మొత్తానికే చేతులెత్తేయడంతో రాష్ట్రం జీరో రిక్రూట్‌మెంట్‌గా మారిపోయిందన్నారు. 1.65 లక్షల ఉద్యోగాలను భర్తీ చేసిన బీఆర్ఎస్‌పై పనిగట్టు కుని బురదజల్లి అబద్ధాలతో అందలం ఎక్కడానికేనని అందరికీ అర్థమైపోయిందని తెలిపారు.

**జాబ్ క్యాలెండర్‌కు పాతర**

జాబ్ క్యాలెండర్‌కు కాంగ్రెస్ ప్రభుత్వం పాతరేసిందని కేటీఆర్ విమర్శించారు. వరుస కుంభకోణాలతో రేవంత్ సర్కారు జేబులు నింపుకుంటున్న తీరును తెలంగాణ సమాజం గమనిస్తూనే ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిరుద్యోగులు, విద్యార్థులు వెంటాడుతారని తెలిపారు. మేధావుల ముసుగు వేసుకుని మాయమాటలతో మభ్యపెట్టిన గొంతులన్నీ గత రెండేండ్ల నుంచి మూగబోయాయన్నారు. రాష్ట్రంలోని అన్ని వర్గాలనూ కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని విమర్శించారు. మూడు దఫాలుగా రైతుబంధు ఎగ్గొట్టి 70 లక్షల మంది అన్నదాతల పొట్టకొట్టారనీ, సీఎం సీటుపై కూర్చున్న మరుక్షణంలోనే ప్రతి మహిళకు రూ.2,500 ఇస్తానని చెప్పిన మాటకు రెండేండ్లయినా అమలు కాకపోవడంతో ఆడబిడ్డలు కోపంతో రగిలిపోతున్నారని చెప్పారు. ఆరు గ్యారెంటీలన్నీ గారడీలేననీ, 420 హామీలన్నీ నయవంచన మాత్రమేనని విమర్శించారు.

# ట్రంప్ ఒత్తిడికి ప్రధాని తలొగ్గారు

(మొదటి పేజి తరువాయి)
నరేంద్ర మోదీపై తీవ్రమైన వత్తిడి ఉన్నట్లు రాహుల్ తెలిపారు. మోదీ ఇమేజ్‌కు చెందిన బెలూన్ వేల కోట్లతో తయారైందని, అది ఏ క్షణమైనా పేలుతుందని ప్రతిపక్ష నేత అన్నారు. మన ప్రధాని అమెరికా వత్తిడికి తలొగ్గారని, భారత దేశ ప్రజలు దీని గురించి ఆలోచించాలని, భారతీయ రైతులు ఆ డీల్ గురించి ఆలోచించాలని, మీ శ్రమ, రక్తం, చమటను మోదీ అమ్మేస్తున్నారని ఆరోపించారు. కేవలం రైతులే కాదు. యావత్ దేశాన్ని అమ్మేశారని, అందుకే తనను సభలో మాట్లాడనివ్వడం లేదని రాహుల్ అన్నారునాలుగు నెలలుగా నిలిచిపోయిన భారత్-అమెరికా ట్రేడ్ డీల్‌పై ఇంత అకస్మాత్తుగా సంతకాలు జరగడంపై రాహుల్ గాంధీ పలు ప్రశ్నలు గుప్పించారు. ఈ డీల్ వివరాలు కేంద్రం వెల్లడించాలని డిమాండ్ చేశారు. ట్రంప్ ఒత్తిడితోనే మోదీ ట్రేడ్ డీల్ కుదుర్చుకున్నారని, దేశాన్ని అమ్మకానికి పెట్టారని, తమ ఇమేజ్ ఎక్కడ దెబ్బతింటుందోనని మోదీ భయపడుతున్నారని విమర్శించారు. ప్రధాని మోదీ వణుకుతున్నారు. భారత్-అమెరికా ట్రేడ్ డీల్ నాలుగు నెలలుగా నిలిచిపోయింది. దానిపై సోమవారం రాత్రి నరేంద్ర మోదీ సంతకం చేశారు. ఆయనపై తీవ్రమైన ఒత్తిడి ఉంది. నరేంద్ర మోదీ ఇమేజ్ దెబ్బతినవచ్చు. రాష్ట్రపతి ప్రసంగంపై ప్రతిపక్ష నేతను మాట్లాడనీయక పోవడం ఇదే మొదటిసారి. ట్రేడ్ డీల్ విషయంలో రాజీపడ్డారు. దేశాన్ని అమ్మేశారు. ఇంతవరకూ మలచుకుంటూ వస్తున్న తన ఇమేజ్ ఇప్పుడు దెబ్బతింటుందోనని మోదీ భయపడుతున్నారు' అని రాహుల్ విమర్శించారు. మోదీ భయపడడానికి కారణాలను రాహుల్ వివరిస్తూ.. 'అదానీపై అమెరికాలో కేసు ఉంది. నిజానికి ఇది మోదీపై కేసు. ఎప్‌స్టీన్ ÷ల్స్‌లో చాలా విషయాలున్నాయి. దానిని అమెరికా ఇప్పటికీ విడుదల చేయలేదు. ఆ ఒత్తిడి కూడా ఉంది. ఒత్తిడికి కారణమవుతున్న రెండు పాయింట్లు ఇవే. దేశం దీనిని అర్థం చేసుకోవాలి' అని అన్నారు.

# 8 మంది కాంగ్రెస్ ఎంపీల సస్పెన్షన్

(మొదటి పేజి తరువాయి)
చింపి స్పీకర్ ఛైర్ వైపు విసిరారన్న కారణంతో 8 మంది కాంగ్రెస్ ఎంపీలను లోక్‌సభ నుంచి సస్పెండ్ చేశారు. ప్రస్తుత బడ్జెట్ సమావేశాలు ముగిసే వరకు ఈ సస్పెన్షన్ అమల్లో ఉంటుందని స్పీకర్ ప్యానెల్ ఆఫ్ చైర్ పర్సన్స్ లో ఒకరైన దిలీప్ సైకియా (ప్యానెల్ స్పీకర్) ప్రకటించారు. సస్పెన్షన్ వేటు పడిన వారిలో అమరీందర్ సింగ్ రాజా వారింగ్, మాణికం ఠాగూర్, గురుజీత్ సింగ్ ఆజులా, హిబి ఈడెన్, చామల కిరణ్ కుమార్ రెడ్డి, ప్రశాంత్ యాదవరావు పడోలే, ఎస్.వెంకటేశన్, డీన్ కురియకోస్ ఉన్నారు. "ప్రతిపక్షాలకు తమ గళం వినిపించే హక్కు ఉంది, కానీ నిరసన పేరుతో సభను పూర్తిగా స్తంభింపజేయడం, ప్రొసీడింగ్స్ జరగకుండా అడ్డుకోవడం పార్లమెంటరీ సంప్రదాయాలకు విరుద్ధం" అని దిలీప్ సైకియా వ్యాఖ్యానించారు.అంతకుముందు, సరిహద్దుల్లో చైనా ఆక్రమణల అంశంపై చర్చించాలంటూ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పట్టుబట్టారు. మాజీ ఆర్మీ చీఫ్ ఎంఎం నరవణే రాసిన పుస్తకానికి సంబంధించిన ఓ మ్యాగజైన్ కథనాన్ని రాహుల్ ప్రస్తావించారు. అయితే, ధృవీకరించని వార్తా కథనాలను సభలో చదవకూడదని ప్యానెల్ స్పీకర్ సైకియా అభ్యంతరం తెలపడంతో వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ సందర్భంగా రాహుల్ స్పందిస్తూ.. "మాట్లాడటానికి నాకు ఎవరి అనుమతి అవసరం లేదు. నేను ప్రతిపక్ష నాయకుడిని.. నాకు పర్మిషన్ అనే పదం వాడటం సరికాదు" అని మండిపడ్డారు.
తూర్పు లడఖ్‌లో ఘర్షణల వల్ల భారత సైనికులు ప్రాణాలు కోల్పోయారని, దీనిపై ప్రధాని స్పందన ఏమిటని రాహుల్ ప్రశ్నించారు. ఈ సమయంలోనే అధికార, విపక్ష సభ్యుల మధ్య తీవ్ర స్థాయిలో మాటల యుద్ధం జరిగింది. విపక్ష సభ్యులు వెల్ లోకి దూసుకెళ్లి నినాదాలు చేశారు. గందరగోళం మధ్యే సస్పెన్షన్ తీర్మానాన్ని ఆమోదించిన అనంతరం సభను మంగళవారానికి వాయిదా వేశారు. టీడీపీ ఎంపీ జి.ఎం. హరీశ్ బాలయోగి రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై మాట్లాడేందుకు ప్రయత్నించినప్పటికీ, సభలో నిరసనల హోరు తగ్గకపోవడంతో ప్రసంగం కొనసాగలేదు.

# వ్యవసాయ కూలీల ట్రాక్టర్ బోల్తా

(మొదటి పేజి తరువాయి)
పసుపు రిక్కా పనికి వెళ్లారు. తిరిగి సాయంత్రం ట్రాక్టర్‌పై గ్రామానికి బయలుదేరారు. మార్గమధ్యలో ట్రాక్టర్ అదుపు తప్పడంతో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో మొగిలిపేట గ్రామానికి చెందిన మంగళరాపు లలిత(45), పెద్దిరెడ్డి గంగు(50), సంపంగి లక్ష్మి(35), రొడ్డ వైష్ణవి(15) తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందారు. సమాచారం అందగానే స్థానికులు, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని అంబులెన్స్‌లో సమీప ఆస్పత్రికి తరలించారు. కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్టు సమాచారం. ఈ ప్రమాదంతో మొగిలిపేట గ్రామంలో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి. బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని, గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని గ్రామస్తులు కోరుతున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

# రోడ్డు నిబంధనలు పాటిస్తామని ప్రతిజ్ఞ

(మొదటి పేజి తరువాయి)
రోడ్డు భద్రతకు స్పృహతో కట్టుబడి ఉండేలా ప్రోత్సహించడం, ప్రాణాలను రక్షించడం ఉమ్మడి బాధ్యత అని సురక్షితమైన అలవాట్లు ఇంట్లోనే ప్రారంభమై ప్రతి రహదారిపై కొనసాగుతాయని గుర్తించడం రవాణా శాఖ లక్ష్యంగా పెట్టుకుంది. రాష్ట్రవ్యాప్తంగా రోడ్డు వినియోగదారులలో క్రమశిక్షణ, అవగాహన, బాధ్యతాయుతమైన ప్రవర్తనను ప్రోత్సహించే దార్శనికతను పునరుద్ఘాటించారు. పౌరులు ట్రాఫిక్ నియమాలను పాటించడానికి మరియు రోడ్డుపై ఉన్న ప్రతి జీవితాన్ని గౌరవించడానికి పౌర ప్రతిజ్ఞను తీసుకోవచ్చు, తల్లిదండ్రులు తల్లిదండ్రుల ప్రతిజ్ఞను ఉదాహరణగా తీసుకొని, పిల్లలలో సురక్షితమైన అలవాట్లను రూపొందించవచ్చు. ఈ చొరవ రోడ్డు భద్రత అంటే కేవలం అమలు మాత్రమే కాదని, కుటుంబాలు, పిల్లలు మరియు తెలంగాణలోని ప్రతి తోటి పౌరుడికి సమిష్టి వాగ్దానం అని గుర్తు చేస్తుంది.ఇది రోడ్డు భద్రతకు ప్రభుత్వం యొక్క బలమైన సంస్థాగత నిబద్ధతను ప్రతిబింబిస్తుంది.ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ..విద్యార్థులకు తల్లిదండ్రులతో ఉన్న బంధాన్ని రవాణా శాఖ రోడ్డు భద్రతకు ఉపయోగించుకోవడానికి ఈరోజు రవాణా శాఖ రోడ్డు భద్రత ప్రతిజ్ఞా వెబ్‌సైట్ ప్రారంభించిందిందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఈ ప్రతిజ్ఞ రాబోయే కాలంలో రోడ్డు ప్రమాదాలు తగ్గించి కారణాలు రక్షించడానికి ఉపయోగపడుతుందని భావిస్తున్నామని పేర్కొన్నారు.రోడ్డు నిబంధనల పాటిస్తామని ప్రతి విద్యార్థి తల్లిదండ్రుల దగ్గర అగ్రిమెంట్ ద్వారా విద్యార్థులతో ఉన్న వారి బాండింగ్ తో రోడ్డు ప్రమాదాలు తగ్గుతాయని ఆకాక్షించారు.ఇది ఆ÷-లనైన్ లో క్షేత్ర స్థాయిలో ప్రతి మోటార్ వెహికిల్ ఉన్న వారి దగ్గరకు తీసుకుపోయి రవాణా శాఖ అధికారులు పెద్ద ఉద్యమంలో తీసుకుపోవాలి.కార్యక్రమంలో స్పెషల్ సీఎస్ వికాస్ రాజ్, రవాణా శాఖ కమిషనర్ ఇలాంబర్తి, జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్లు చంద్రశేఖర్ గౌడ్, శివ లింగయ్య,రాష్ట్ర రవాణా అథారిటీ సభ్యుడు నవీన్ పె÷-టటెం తదితరులు పాల్గొన్నారు.

# అసంతృప్త నేతలను బుజ్జగించండి

(మొదటి పేజి తరువాయి)
కార్యక్రమాల్లో బిజీగా ఉన్నందున డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఈ సమావేశానికి హాజరు కాలేదు.
అయితే పీసీసీ చీఫ్‌కు వారు ఇదే విషయమై సమాచారమిచ్చారు. సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూడ పలు సర్వేల ప్రకారం పార్టీ వెనుకబడి ఉన్న మున్సిపాల్టీల్లోని పరిస్థితులపై విశ్లేషించారు. తనతోపాటు మంత్రులు ఆయా ప్రాంతాల్లో ఎప్పుడెప్పుడు పర్యటించాలనే విషయాలపై ఆయన వారితో చర్చించారు. కాంగ్రెస్ వీక్‌గా ఉన్న జిల్లాల ఇన్‌ఛార్జి మంత్రులతో ఎప్పటికప్పుడు సమావేశాలు నిర్వహించాలంటూ బాధ్యులకు సూచించారు. విబేధాలను పక్కనబెట్టి అందరూ సమిష్టిగా పని చేయాలని, ఓట్లు చీలకుండా చూడాలని కోరారు. పాత, కొత్త నేతలు సమన్వయంతో పని చేయటం ద్వారా కచ్చితంగా అన్ని స్థానాల్లోనూ పార్టీని గెలిపించాలంటూ దిశా నిర్దేశం చేశారు. ఈ బాధ్యత కచ్చితంగా పార్లమెంటు నియోజకవర్గ బాధ్యులదేనని స్పష్టం చేశారు. ఎన్నికలు అయిపోయేంత వరకు ఇన్‌ఛార్జిలందరూ జిల్లాలు, నియోజకవర్గాల్లో ఉండి మానిటరింగ్ చేయాలంటూ సీఎం ఈ సందర్భంగా ఆదేశించినట్టు సమాచారం. ఏమైనా సమస్యలు ఉంటే ఎప్పటికప్పుడు పీసీసీ చీఫ్‌తోపాటు వార్ రూమ్ దృష్టికి తీసుకురావాలంటూ ఆయన సూచించినట్టు తెలిసింది.

**సీఎంకు అభినందనలు**

హార్వర్డ్ యూనివర్సిటీకి చెందిన కెనడీ స్కూల్‌లో లీడర్‌షిప్ ప్రోగ్రామ్‌ను సీఎం రేవంత్ రెడ్డి ఇటీవల పూర్తి చేసిన సంగతి విదితమే. సమావేశంలో ఈ అంశం ప్రస్తావ-



నకురాగా మీనాక్షి నటరాజన్, మహేశ్‌కుమార్‌తోపాటు మంత్రులందరూ సీఎంను అభినందించారు. కాగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం నుంచి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించనున్నారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో బుధవారం ఆయన పర్యటిస్తారు. రూ.200 కోట్లతో అక్కడ ఏర్పాటు చేయనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌కు సీఎం శంకుస్థాపన చేస్తారు. మహిళా సంఘాలకు చెక్కులను పంపిణీ చేసిన అనంతరం అక్కడ నిర్వహించే బహిరంగ సభలో ప్రసంగిస్తారు.
90 శాతం స్థానాల్లో గెలుస్తాం : మహేశ్ కుమార్ గౌడ్
భేటీ అనంతరం పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూడ పార్టీ తరపున పోటీ చేయబోయే 90 శాతం మంది అభ్యర్థులకు బీ-ఫామ్‌లను అందజేశామని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల్లో 90 శాతం స్థానాలను కాంగ్రెస్ కైవసం చేసుకుంటామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. తమకు ఎవరితోనూ పోటీ లేదని, తమకు తామే పోటీ అని వ్యాఖ్యానించారు. తమ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలే కాంగ్రెస్‌ను గెలిపిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎంఐఎం, సీపీఐ(ఎం), సీపీఐ, జన సమితి పార్టీలతో పొత్తులుంటాయని చెప్పారు. ఒకట్రెండు నియోజకవర్గాల్లో తప్ప తమ పార్టీకి ఎక్కడా ఎలాంటి ఇబ్బందుల్లేవని స్పష్టం చేశారు. గద్వాల నేతల మధ్యనున్న సమస్యలను పరిష్కరించామని, జగిత్యాలకు సంబంధించి సీనియర్ నేత జీవన్‌రెడ్డితో చర్చిస్తామని వెల్లడించారు.

# దేశ గోప్యతను అడ్డుకోలేరు

(మొదటి పేజి తరువాయి)
ఒకవేళ దేశ చట్టాలను పాటించకపోతే భారత్‌ను వీడి వెళ్లొచ్చని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ హెచ్చరించారు. 2021లో వాట్సప్‌లో గోప్యతా విధానానికి సంబంధించిన ఓ పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది. తమ వాణిజ్య ప్రయోజనాల కోసం వాట్సప్ వినియోగదారుల డేటాను మెటాతో పంచుకుంటోందని.. ఇది దోపిడీ కిందకే వస్తుందని ప్రభుత్వం తరపున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోర్టుకు తెలిపారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి స్పందిస్తూ.. మెటాను హెచ్చరించారు. వాట్సాప్ ప్రైవసీ పాలసీపై అసహనం వ్యక్తం చేసారు. భారత్‌లో కార్యకలాపాలు సాగించాలంటే ఇక్కడి చట్టాలను పాటించి తీరాల్సిందేనని స్పష్టం చేసారు. మా దేశ గోప్యతతో మీరు ఆడుకోలేరు. మా డేటాకు సంబంధించి ఒక్క అంకెను పంచుకోవడానికి కూడా మిమ్మల్ని అనుమతించము' అని అమెరికాకు చెందిన మెటాను సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ మందలించారు. దేశ చట్టాలను పాటించకపోతే భారతదేశం విడిచి వెళ్లాల్సి ఉంటుందని హెచ్చరించారు. వాట్సాప్ 2021 ప్రైవసీ పాలసీకి సంబంధించిన పిటిషన్‌ను సుప్రీం కోర్టు తాజాగా విచారించింది. వాణిజ్య ప్రయోజనాల కోసం వినియోగదారుల డేటాను పంచుకోవడం దోపిడీ అని ప్రభుత్వం తరపున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదించారు. దేశంలోని లక్షలాది మంది పేదలు, చదువురాని ప్రజలు ప్రైవసీ పాలసీని అర్థం చేసుకోగలరా అని మెటా ప్రతినిధులను చీఫ్ జస్టిస్ సూటిగా ప్రశ్నించారు .కొన్ని సందర్భాల్లో మెటా పాలసీలు అర్థం చేసుకోవడం తమకే ఇబ్బందిగా మారుతోందని, అలాంటప్పుడు గ్రామీణ భారత దేశ ప్రజలకు ఎలా అర్థం అవుతుందని ప్రశ్నించారు. కాగా, మెటా ఇంజినీరింగ్ బృందం ఇతరుల వాట్సాప్ మెసేజ్‌లను చదవగలదని వాట్సాప్ అంతర్జాతీయ వినియోగదారుల బృందం ఇటీవల అమెరికా కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ నేపథ్యంలో తాజాగా సుప్రీంకోర్టు హెచ్చరికలు మెటాను మరింత ఇబ్బందుల్లోకి నెట్టేస్తున్నాయి. కొన్నిసార్లు మెటా విధానాలను అర్థం చేసుకోవడానికి తాము కూడా ఇబ్బందిపడతామన్నారు. ఒకసారి తనకు ఓ వైద్యుడు వాట్సప్‌లో మందుల ప్రిస్క్రిప్షన్ పంపితే.. దానికి సంబంధించిన ప్రకటనలే ఫోన్‌లో కనిపించాయన్నారు. ఇక దేశంలోని లక్షలాదిమంది పేద, చదువురాని ప్రజలు ఈ విధానాలను ఎలా అర్థం చేసుకుంటారని ప్రశ్నించారు.2021 జనవరిలో వాట్సప్ కొత్త ప్రైవసీ పాలసీని తీసుకొచ్చింది. దీని ప్రకారం.. యూజర్లు వాట్సప్ బిజినెస్ అకౌంట్లతో జరిపే సంభాషణకు సంబంధించిన సమాచారాన్ని ఫేస్‌బుక్‌తో పంచుకొనేందుకు అనుమతి లభిస్తుంది. కొత్త పాలసీకి అంగీకరించని వారి ఖాతాలను రద్దు చేస్తామని తొలుత హెచ్చరించింది. కానీ, దీనిపై తీవ్రస్థాయిలో ఆందోళన వ్యక్తమైంది. ఇది వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగించడమేనని అభ్యంతరాలు వచ్చాయి. దీనిపై జోక్యం చేసుకొన్న కేంద్ర ప్రభుత్వం వెంటనే పాలసీ అమలును నిలిపివేయాలని ఆదేశించింది. ఐటీ చట్టంలోని నిబంధనలకు ఈ కొత్త పాలసీ పూర్తి విరుద్ధంగా ఉందని తేల్చి చెప్పింది. ఈ పాలసీపై దాఖలైన పిటిషన్‌పై తాజాగా విచారణ జరిపిన సుప్రీం ధర్మాసనం పై వ్యాఖ్యలు చేసింది.

-------------

# ప్రకృతి వ్యవసాయ హబ్‌గా ఏపీ

(మొదటి పేజి తరువాయి)
నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ కోకో సిటీలో సాగు, ప్రాసెసింగ్, మార్కెటింగ్ వంటి అన్ని ప్రక్రియలు ఒకేచోట ఉండేలా, ప్రపంచస్థాయి ప్రమాణాలతో దీనిని అభివృద్ధి చేయాలని ఆయన స్పష్టం చేశారు. దీనితో పాటు మామిడి, జీడిమామిడి, కొబ్బరి తోటల్లో కోకోను అంతర పంటగా సాగు చేసేలా రైతులను ప్రోత్సహించాలని సూచించారు.
రాష్ట్రాన్ని దేశంలోనే అతిపెద్ద ప్రకృతి వ్యవసాయ క్షేత్రంగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆకాంక్షించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 18 లక్షల మంది రైతులు 20 లక్షల ఎకరాల్లో ప్రకృతి సేద్యం చేసేందుకు ముందుకొచ్చారని, ఈ స్ఫూర్తిని కొనసాగించాలని అన్నారు. 2030-31 నాటికి 40 లక్షల మంది రైతులను భాగస్వాములను చేస్తూ, సాగు విస్తీర్ణాన్ని 50 లక్షల ఎకరాలకు పెంచాలని లక్ష్యంగా నిర్దేశించారు.రసాయన ఎరువుల వాడకాన్ని పూర్తిగా తగ్గించడం ద్వారా రైతులకు పెట్టుబడి వ్యయం తగ్గి, వారి ఉత్పత్తులకు అధిక ధర లభిస్తుందని వివరించారు. ప్రకృతి సాగు ఉత్పత్తుల నాణ్యతను ధ్రువీకరించేందుకు సర్టిఫికేషన్, ట్రేసబిలిటీ సదుపాయాలను ఏప్రిల్ నాటికి సిద్ధం చేయాలన్నారు. సుభాష్ పాలేకర్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా రైతులకు శిక్షణా తరగతులు నిర్వహిస్తామని తెలిపారు.
సంప్రదాయ పంటలతో పాటు, వాణిజ్యపరంగా లాభదాయకమైన పంటల సాగును ప్రోత్సహించాలని సీఎం సూచించారు. ఇందులో భాగంగా, లంబసింగి ప్రాంతంలో స్థానిక గిరిజనుల భాగస్వామ్యంతో పబ్లిక్-ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ (పీపీపీ) విధానంలో కుంకుమపువ్వు సాగు చేపట్టే సంస్థలకు అనుమతులు ఇవ్వాలని ఆదేశించారు. అరటి ఉత్పత్తిలో దేశంలో రెండో స్థానంలో ఉన్నా, ఎగుమతుల్లో వెనుకబడ్డామని, ఇకపై ఎగుమతులపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు.
వ్యవసాయంతో పాటు అనుబంధ రంగాలైన ఆక్వా, పౌల్ట్రీ పరిశ్రమల బలోపేతానికి కూడా ముఖ్యమంత్రి పలు కీలక సూచనలు చేశారు. ఆక్వా రైతులు తమ సాగు వివరాలను తప్పనిసరిగా నమోదు చేసుకునే విధానాన్ని అమలు చేయాలన్నారు. పౌల్ట్రీ రంగానికి ఊతమిచ్చేలా, ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీలకు కోడిగుడ్లు సరఫరా చేసే కాంట్రాక్టులను నేరుగా రైతులకే అప్పగించాలని నిర్దేశించారు.
ఎల్‌నినో వంటి వాతావరణ సవాళ్లను ఎదుర్కొనేందుకు ఏఐ ఆధారిత క్రాప్ అడ్వయిజరీ 'భారత్ విస్తార్' వంటి టెక్నాలజీలను వినియోగించుకోవాలని సీఎం సూచించారు. విజయవాడలో పీపీపీ విధానంలో ఫ్లవర్ మార్కెట్ నిర్మాణానికి అంగీకారం తెలిపారు.

# బయ్యారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఘనంగా ఆశా డే.




**బయ్యారం/ఫిబ్రవరి 3(జర్నలిస్ట్ వార్త.);**
మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి డాక్టర్ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా ఆశా డే నిర్వహించారు. దీనికి జిల్లా వైద్యాధికారి డాక్టర్ బి.రవి రాథోడ్ ఆదేశానుసారం ఆశా డే కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ సారంగం హాజరై మాట్లాడుతూ, ఇన్స్టిట్యూషనల్ డెలివరీలను పెంపొందించడం, మాతృ మరణాలను తగ్గించడం అని తెలిపారు. గర్భిణీ స్త్రీలకు మొదటి,రెండవ పరీక్షలు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారుల ద్వారా చేయించాలని,మూడవ,నాల్గవ పరీక్షలను ప్రభుత్వ జనరల్ హాస్పిటల్‌లోని స్త్రీ వైద్య నిపుణులచే చేయించుకోవాలని తెలిపారు. అవసరమైన సందర్భాల్లో 102 వాహన సేవలను వినియోగించుకోవచ్చని పేర్కొన్నారు. అలాగే సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలని,సిజేరియన్ ఆపరేషన్ల వల్ల కలిగే నష్టాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని ఆశా కార్యకర్తలను కోరారు. వ్యాధి నిరోధక టీకాలు 100 శాతం పూర్తయ్యేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కీటకజన్య వ్యాధులైన మలేరియా,డెంగ్యూ,చికెన్ గునియా,ఫైలేరియా నివారణకు ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించాలని తెలిపారు.
అలాగే అసంక్రమిత వ్యాధులైన బీపీ,షుగర్, క్యాన్సర్ కోసం 30 సంవత్సరాల పైబడిన వారందరికీ పరీక్షలు నిర్వహించి,ఆభా కార్డులో నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ సుధీర్ రెడ్డి,ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ లక్ష్మీనారాయణ,ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ విజయ్,కె.వి. రాజు,స్వామి,డీపీఓ నిలోహన,కృష్ణ (హెచ్ఈఓ),ఆరోగ్య కార్యకర్తలు,ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో బెల్టు షాపుల మోత

## మండలంలో విచ్చల విడిగా అక్రమ మద్యం దందా - టీఎస్ ఎమ్మార్పీఎస్ ఆరోపణ



**భీమదేవరపల్లి/ఫిబ్రవరి3 (జర్నలిస్ట్ వార్త):**
గ్రామాల్లో అక్రమ బెల్టు షాపులు విచ్చలవిడిగా పెరుగుతున్నాయని తెలంగాణ ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు అంబాల చక్రపాణి ఆరోపించారు. ముల్కనూరులో లైసెన్సు పొందిన మూడు వైన్ షాపులు ఉండగా, వాటిలో రెండు మాత్రమే ప్రజలకు తెరిచి ఉన్నాయని తెలిపారు. మిగిలిన ఒక వైన్ షాపు పూర్తిగా బెల్టు షాపులకు మద్యం సరఫరా చేస్తూ అక్రమంగా లాభాలు ఆర్జిస్తున్నట్టు ఆరోపించారు. ఆ వైన్ షాపు ఉన్న విషయమే ప్రజలకు తెలియని పరిస్థితి నెలకొని ఉందని, ఎంఆర్పీ ధరలకే విక్రయిస్తేనే లాభాలు వస్తున్నప్పటికీ బెల్టు షాపుల ద్వారా ఒక్కో క్వార్టర్‌పై రూ.20 నుంచి రూ.40 వరకు అదనంగా వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో పెద్ద కుంభకోణం దాగి ఉందని అన్నారు. గత రెండేళ్లలోనే గ్రామాల్లో బెల్టు షాపులు పుట్టగొడుగుల్లా పెరిగిపోయాయని విమర్శించారు. అక్రమ మద్యం విక్రయాల వల్ల సామాన్య ప్రజలు ఆర్థికంగా, సామాజికంగా నష్టపోతున్నారని తెలిపారు. ఈ అంశంపై ప్రభుత్వం తక్షణమే స్పందించి ఎక్సైజ్ శాఖ, పోలీస్ యంత్రాంగం కలిసి గ్రామాల్లోని అన్ని అక్రమ బెల్టు షాపులను మూసివేయాలని టీఎస్ ఎమ్మార్పీఎస్ జిల్లా కమిటీ డిమాండ్ చేస్తోందన్నారు. చర్యలు తీసుకోకపోతే రాస్తారోకోలు, ధర్నాలు నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు.

# కట్ర్యాల మల్లన్న ఆదాయం ఎటు?

## అభివృద్ధికి నోచుకోని పురాతన ఆలయం..



**వర్ధన్నపేట/ఫిబ్రవరి3(జర్నలిస్ట్ వార్త);**
వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం కట్ర్యాల గ్రామ శివారులోని శ్రీ మల్లికార్జున స్వామి దేవస్థానం నేడు రాజకీయ చదరంగంలో చిక్కుకుంది. భక్తికి నిలయంగా ఉండాల్సిన ఆలయం, ఆదాయం పంపకాల్లో వివాదాలకు కేంద్రబిందువుగా మారుతోంది. గత పదేళ్లుగా ఆలయ కమిటీల తీరుపై భక్తులు, గ్రామస్థులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.

### రాజకీయ పీఠం కోసమే పాకులాట?

జాతర రావడానికి నెల రోజుల ముందు నుండే గ్రామంలో రాజకీయ ప్రకంపనలు మొదలవుతున్నాయి. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ నాయకులే చైర్మన్ పీఠం దక్కించుకోవాలనే పట్టుదలతో గందరగోళం సృష్టిస్తున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. భక్తి కంటే రాజకీయ ఆధిపత్యమే ఇక్కడ ప్రధానమవుతోంది.

### నిధుల లెక్కల్లో పారదర్శకత శూన్యం

గత పదిహేను ఏళ్లుగా ఆలయ అభివృద్ధి కోసం కమిటీలను ఏర్పాటు చేస్తున్నారు. నియమావళి ప్రకారం ఆదాయంలో 25 శాతం ఒగ్గు పూజారులకు కేటాయించాలి. మిగిలిన నిధులను ఆలయ అభివృద్ధికి వెచ్చించాలి, క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉంది. పట్నాలు, కానుకల రూపంలో వచ్చే లక్షలాది రూపాయల ఆదాయం ఏమవుతుందో ఎవరికీ తెలియడం లేదు. జాతర ముగియగానే కమిటీ సభ్యులు ఆలయం వైపు కన్నెత్తి కూడా చూడకపోవడం గమనార్హం.

### అధికారుల ఉదాసీనత - భక్తుల ఆవేదన

కమిటీల ఏర్పాటు సమయంలో జోక్యం చేసుకునే ఎమ్మెల్యేలు, మండల స్థాయి అధికారులు ఆదాయం లెక్కల విషయంలో మాత్రం మాకేం సంబంధం లేదు అన్నట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు మండిపడుతున్నారు. ఈ కమిటీలు స్వామి వారి సేవ కోసమా? లేక ఆదాయం పంచుకోవడానికా? అని భక్తులు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు.

### గ్రామస్థుల డిమాండ్ ఇదే..

గత పదేళ్ల కాలంలో వచ్చిన ఆదాయం ఎంత? చేసిన అభివృద్ధి పనులు ఏమిటి? అన్న విషయాలపై కమిటీలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి గ్రామ పంచాయతీ ఆవరణలో బహిరంగ ప్రకటన చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం, దేవాదాయ శాఖ ఇప్పటికైనా స్పందించి విచారణ జరిపి, ఆలయ పవిత్రతను కాపాడాలని కోరుతున్నారు.

# బాధిత కుటుంబానికి అండగా నామాలపాడు సర్పంచ్.




**బయ్యారం/ఫిబ్రవరి 3(జర్నలిస్ట్ వార్త);** మండలంలోని నామాలపాడు గ్రామపంచాయతీ పరిధిలో రావికుంట గ్రామానికి చెందిన దొంతర బోయిన మల్లయ్య జీవితభాగస్వామి యాకమ్మ ఇటీవల మరణించారు.వారి కుటుంబాన్ని సర్పంచ్ వర్స దీపప్రకాష్ దొర పరామర్శించి అండగా ఉంటామని మనోధైర్యం కల్పించి 50కేజీల బియ్యం,2000 రూపాయలు ఆర్థిక సహాయం చేశారు. ఈ కార్యక్రమంలో దొంతరబోయిన నాగరాజు,వార్డ్ సభ్యులు గొగ్గల రామకృష్ణ,చీమల కృష్ణ,గుండా సుమలత,సుధాకర్,తెగుళ్ల నందిని, వీరభద్రం,కొత్తపేట మాజీ సర్పంచ్ ఇర్ప మమత రాజేష్,ఊకె రామ్మూర్తి,తుర్సం యర్రయ్య, వర్స పరమేష్, బత్యం వెంకటేష్, కోరెం జంపన్న,సురబోయిన రాంబాబు,బసనబోయిన వెంకన్న,చెన్నబోయిన వేణు,వర్స సంపత్,పులుగుజ్జు రాజు,గుంపిని సమ్మయ్య,బత్యం భాస్కర్,శీలం వినయ్ తదితరులు పాల్గొన్నారు.

# 5వ తేదీ నుంచి వర్ధన్నపేటలో సీఎం కప్ క్రీడలు

**వర్ధన్నపేట/ఫిబ్రవరి 3(జర్నలిస్ట్ వార్త);**
వర్ధన్నపేట మండలంలో ముఖ్యమంత్రి కప్ (సీఎం కప్)--2025 రెండో ఎడిషన్ క్రీడల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి అయ్యాయి. జిల్లా కలెక్టర్, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు ఈ నెల 5వ తేదీ (గురువారం) నుంచి మండల స్థాయి క్రీడలు ప్రారంభం కానున్నట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ) వెంకటరమణ తెలిపారు. గ్రామ స్థాయిలో నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబరిచిన విజేతలు మండల స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. ఈ పోటీలు ఉదయం 9 గంటలకు వర్ధన్నపేట మండలం చెన్నారం గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రారంభమవుతాయని, మండలంలోని అన్ని గ్రామాల క్రీడాకారులు హాజరై క్రీడా స్ఫూర్తితో పాల్గొనాలని ఎంపీడీఓ కోరారు. క్రీడల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లను మండల స్థాయి కమిటీ ఇప్పటికే పూర్తి చేసింది. పోటీల వివరాలను జిల్లా క్రీడల అధికారి (డివైఎస్ఓ)కి నివేదించినట్లు అధికారులు వెల్లడించారు.

# తాటికొండలో ఘనంగా దర్గా ఉర్స్ ఉత్సవాలు



**స్టేషన్ ఘన్ పూర్/ ఫిబ్రవరి 3(జర్నలిస్ట్ వార్త) :**
మండలంలోని తాటికొండ గ్రామంలో గల గడీల లో దర్గా ఊర్సు ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఊర్సు జెండా ఆవిష్కరిం చారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గ్రామ సర్పంచ్ మారపాక సుజనా శ్రీనివాస్ హాజరయ్యా రు. ఈ సందర్భంగా ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ మారపాక రాములు, ముస్లిం పెద్దలు ఎండి అబ్బాస్, ఎండి కూర్బనాలి, మోసిన్, ఎండి అక్రమ్, అమీర్ అలీ, అమీర్ బాబా, అరాఫత్, అక్బర్, రియాజ్, కమర్, గయాస్, ముస్లిం కుల పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



# గ్రామ అభివృద్ధే లక్ష్యం

## : సర్పంచ్ కృష్ణవేణి

**తల్లాడ /ఫిబ్రవరి 3 (జర్నలిస్ట్ వార్త):**
తల్లాడ మండలం పరిధిలోని బిల్లుపాడు గ్రామంలో పంచాయతీ పరిధిలో ఉన్న డ్రైనేజీ కాల్వల్లో పూడిక పేరుకుపోవడంతో గ్రామ ప్రజలు ఈ సమస్యను సర్పంచ్ కృష్ణవేణి దృష్టికి తీసుకురాగా, ఆమె వెంటనే స్పందించి మంగళవారం పంచాయతీ సెక్రటరీ సాయికుమార్‌తో కలిసి డ్రైనేజీ మరమ్మతులు చేపట్టించారు. డ్రైనేజీ కాల్వల్లో పూడిక తొలగింపు పనులను పంచాయతీ మల్టీపర్పస్ కార్మికుల ద్వారా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కృష్ణవేణి మాట్లాడుతూ, గ్రామాభివృద్ధే తమ ప్రధాన లక్ష్యమని వెల్లడించారు.

# బడ్జెట్‌లో దక్కాల్సిన నిధులపై కార్యాచరణ

## వివిధ రంగాలకు కేటాయింపులపై ప్రణాళికలు

## అధికారులతో సమీక్షించిన సిఎస్ రామకృష్ణారావు

**హైదరాబాద్,ఫిబ్రవరి 03 (జర్నలిస్ట్ వార్త):** : కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన 2026 -27 ఆర్థిక సంవత్సర బడ్జెట్ లో రాష్ట్రానికి దక్కాల్సిన నిధులకు సంబంధించి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు పేర్కొన్నారు. డా. బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సి.ఎస్ రామకృష్ణా రావు మాట్లాడుతూ, కేంద్ర ప్రాయోజిత పథకాల నుండి అత్యధిక నిధులు పొందేలా ప్రణాళిక బద్దంగా పనిచేయాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వ సి.ఎస్.ఎస్ క్రింద ఐదు లక్షల కోట్ల రూపాయలు బడ్జెట్ లో ప్రతి పాదించిందని, దీనిలో భాగంగా 15 శాతం జనాభా ఉన్న తెలంగాణాకు కనీసం రూ. 25 వేలకోట్లు రావాల్సి ఉందని స్పష్టం చేసారు. ఈ కేంద్ర బడ్జెట్ లో ఫార్మా, రంగ అభివృద్ధి, సెమి కండక్టర్ తయారీ, వ్యవసాయ రంగంలో పలు అంశాల అభివృద్ధికి ప్రాధాన్యత నిచ్చారని, ఈదిశగా తగు చర్యలు తీసుకోవాలని సి.ఎస్ సూచించారు. ఖమ్మం, వరంగల్ కరీంనగర్ జిల్లాను కలుపుతూ టెంపుల్ కారిడార్ అభివృద్ధికి అవకాశం అందని, దీనిలో భాగంగా వరంగల్ లో మామునూరు ఎయిర్ పోర్ట్ కూడా వస్తున్నందున ఈ జిల్లాల్లో టూరిజం, పారిశ్రామిక, వాణిజ్య రంగాల అభివృద్ధి కి గణనీయమైన అవకాశం ఉందని అన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనూ రాష్ట్రానికి మరో పది వేల కోట్ల రూపాయలు రావాల్సి ఉందని ఈ విషయంలో సంబంధిత శాఖల కార్యదర్శులు ప్రత్యేక కృషి చేయాలన్నారు. 16 ఆర్థిక కమిషన్ లోభాగంగా 2011 జనాభా ప్రాతిపదికపై నిధుల మంజూరు ఉంటుందని, దీనితో పాటు డెమోగ్రాఫిక్ ఏరియా, పథకాల అమలు సామర్థ్యం, నిధుల వినియోగం లాంటి ప్రాతిపదికలపై కూడా నిధుల కేటాయింపు ఉంటుందని వివరించారు. ప్రధానంగా అభివృద్ధి ఆధారిత ఇండికేటర్ల ప్రాతిపదిక ప్రకారం నిధుల కేటాయింపుకు ప్రాధాన్య నిచ్చారని అన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు సి.వీ. ఆనంద్, వికాస్ రాజ్, సంజయ్ కుమార్, జయేష్ రంజన్, సవ్య సాచి ఘోష్, అహ్మద్ నదీమ్, ముఖ్య కార్యదర్శులు సందీప్ సుల్తానియా, నవీన్ మిట్టల్, ఎన్. శ్రీధర్, కార్యదర్శులు పాల్గొన్నారు.

# ముత్తారం త్రికుటేశ్వరాలయంలో జాతర ఏర్పాట్లు పరిశీలన

## ఉత్సవాల ఏర్పాట్లకు ఎస్ఐ రాజు సూచనలు

**భీమదేవరపల్లి ఫిబ్రవరి 03 (జర్నలిస్ట్ వార్త):**
హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముత్తారం గ్రామంలోని శ్రీ త్రికుటేశ్వరాలయంలో ఈనెల 14 నుంచి నిర్వహించనున్న మహాశివరాత్రి జాతర ఏర్పాట్లను ఎస్సై రాజు మంగళవారం పరిశీలించారు. జాతర సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లు చేపట్టాలని ఆలయ నిర్వాహకులకు సూచించారు. ఈ సందర్భంగా ఆలయ పరిసరాల్లో పార్కింగ్ ఏర్పాట్లు, భక్తుల కోసం ప్రత్యేక క్యూ లైన్లు, భద్రతా చర్యలు, ట్రాఫిక్ నియంత్రణ, అత్యవసర సేవల అందుబాటు వంటి అంశాలపై ఎస్సై సమీక్షించారు. మూడు రోజుల పాటు జరగనున్న మహాశివరాత్రి ఉత్సవాలను సక్రమంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకుంటామని టీటీడీఎస్ (త్రికుటేశ్వరాలయ



టెంపుల్ డెవలప్మెంట్ సొసైటీ) చైర్మన్ కాశిరెడ్డి ఆదిరెడ్డి ఎస్సై రాజుకు వివరించారు. పోలీస్ శాఖతో పాటు టీం సభ్యుల సమన్వయంతో భక్తుల సౌకర్యాలు పూర్తి చేస్తామని తెలిపారు. భక్తుల రాకపోకలు సజావుగా సాగేందుకు ఆలయ పరిసరాల్లో బారికేడ్లు, సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని, రాత్రి వేళల్లో తగినంత లైటింగ్ ఉండేలా చూడాలని ఎస్సై సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణకు అవసరమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఊరడి జైపాల్ రెడ్డి,




మామిడాల చంద్రశేఖర్, కాశిరెడ్డి నరేందర్ రెడ్డి, వడ్డేపల్లి చక్రపాణి, దేవరాజు సురేష్, నరేష్, వనపర్తి శ్రీనివాస్, హింగే తిరుపతి, మామిడాల శ్రావణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనపూర్ మున్సిపాలిటీని మోడల్ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుదాం

### .వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య

### మున్సిపాలిటీ పరిధిలోని 18 వార్డుల్లో కాంగ్రెస్ జెండా ఎగరాలి - ఎమ్మెల్యే కడియం శ్రీహరి

**స్టేషన్ ఘన్ పూర్/ ఫిబ్రవరి 3 (జర్నలిస్ట్ వార్త ):** ఘనపూర్ మున్సిపాలిటీని మోడల్ మున్సిపాలి టీగా తీర్చిదిద్దుదామని, మున్సిపల్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ గెలుపే ధ్యేయంగా పని చేయాలనివరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అన్నారు.స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీ ఎన్నికలనేపథ్యం లో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడి యం కావ్య మంగళవారం స్టేషన్ ఘనపూర్ పట్ట ణ కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో అభ్యర్థుల చేతికి బీ-ఫామ్ లు అందజేశారు. బీ-ఫామ్లు అందుకున్న అభ్యర్థులు వెంటనే ఎన్నికల అధికా రులకు బి-ఫామ్ సమర్పించాలని ఎంపీ సూచిం చారు. ఈ సందర్భంగా ఎంపీ కడియం కావ్య మాట్లాడుతూ అధికారికంగా పార్టీ తరపున బీ- ఫామ్లు అందాయని, ప్రభుత్వ ప్రజారంజక పాల న, అమలవుతున్న గ్యారంటీలను ఇంటింటికీ తీసుకెళ్లి ఓటర్ల ఆశీస్సులు పొందాలని పిలుపు నిచ్చారు. వార్డుల వారీగా కార్యకర్తలను సమన్వ యం చేసుకుని ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేయాలని, ప్రత్యర్థుల వ్యూహాలను సమర్థంగా ఎదుర్కోవాలని దిశానిర్దేశం చేశారు. స్టేషన్ ఘన పూర్ మున్సిపాలిటీలోని 18 వార్డుల్లో కాంగ్రెస్ అభ్యర్థులే గెలుపు సాధిస్తారని ఎంపీ డాక్టర్ కడి యం కావ్య ధీమా వ్యక్తం చేశారు. మున్సిపాలిటీ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని అన్నా రు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన గ్యారంటీ పథకా లు ప్రజల్లో విశేష ఆదరణ పొందుతున్నాయని పేర్కొన్నారు.పట్టణాభివృద్ధి, మౌలిక సదుపాయా ల కల్పనకు తమ పార్టీ కట్టుబడి ఉందని, మున్సి పాలిటీ ప్రజలు కాంగ్రెస్ అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని ఎంపీ కోరారు. గత పాలకులు స్టేషన్ ఘనపూర్‌ను మున్సిపాలిటీ చేస్తానని గత ఎమ్మె ల్యే మాటలు చెప్పడమే తప్ప ఏమీ చేయలేదని విమర్శించారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా వచ్చిన తర్వాతే స్టేషన్ ఘనపూర్‌ను మున్సిపాలి టీగా ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు.స్టేషన్ ఘనపూర్ అభివృద్ధి కోసం ఎమ్మెల్యే కడియం శ్రీహరి గారు అహర్నిశలు కృషి చేస్తున్నారని వెల్లడించారు. స్టేషన్ ఘనపూర్ లో జరుగుతున్న అభివృద్ధినిచూసే ప్రజలుఓటువేయాలని పిలుపు నిచ్చారు.గతంలో వర్షం పడితే స్టేషన్ ఘనపూర్




వరదమయంగా మారేదని, ప్రస్తుతం అలాంటి పరిస్థితి లేకుండా రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థను అభి వృద్ధి చేసుకుంటున్నామని తెలిపారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీ లో ఇప్పటికే 50 కోట్లతో అభివృద్ధి పనులు ప్రారం భించారని చెప్పారు. మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలిచిన తర్వాత మరో 50 కోట్లతో అభివృద్ధి పనులు చేపడతామని ప్రకటించారు.స్టేషన్ ఘనపూర్‌ను ఒక మోడల్ మున్సిపాలిటీ గా తీర్చిదిద్దుదామనిఅన్నారు.శివునిపల్లి, చాగల్, ఘనపూర్ మున్సిపాలిటీ పరిధిలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలి పించాలని పిలుపునిచ్చారు. ఈ మున్సిపాలిటీ గెలుపు బాధ్యతను తానే తీసుకుంటానని అభ్య ర్థుల గెలుపుకోసం మనందరం కలిసిపని చేద్దామ ని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా చేసుకొని పనిచేయాలని కార్యకర్తలకు సూచించా రు. కాంగ్రెస్ పార్టీ గెలిస్తేనే మున్సిపాలిటీకి వచ్చే నిధులుసక్రమంగా వినియోగించుకోవచ్చని అన్నా రు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకోలేనిదని, నియోజకవర్గ అభివృద్ధి, ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్నామని తెలిపా రు. మున్సిపాలిటీలోని 18కి 18 వార్డుల్లో కాంగ్రెస్ పార్టీజెండా ఎగరవేయాలని కార్యకర్తలకు పిలుపు నిచ్చారు.అభ్యర్థుల ఎంపిక ప్రక్రియను పూర్తి పార దర్శకంగా నిర్వహించడం జరిగిందని ఎమ్మెల్యే కడియం శ్రీహరి పలు దఫాలుగా నిర్వహించిన సర్వేలు, టీపీసీసీ సర్వేల నివేదికల ఆధారంగానే అభ్యర్థులను ఎంపిక చేశామని తెలిపారు.పార్టీ తీసుకున్న నిర్ణయానికి అందరూ కట్టుబడి ఉండా లని, అభ్యర్థుల గెలుపు కోసం సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.టికెట్ ఆశించిఅవకా శం దక్కని ఆశావాహులు నిరుత్సాహపడాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. భవిష్యత్తులో పార్టీ వారికి మరిన్ని అవకాశాలు కల్పిస్తుందని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లా డుతూ మున్సిపాలిటీ పరిధిలోని 18 వార్డుల్లో కాంగ్రెస్ జెండా ఎగరాలని, నియోజకవర్గ అభివృ ద్దే ఏకైక లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు జూలుకుంట్ల శిరీష్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాంబాబు, చిల్పూర్ గుట్ట దేవస్థాన చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్ రావు, నాయకులు బెలిదె వెంకన్న,బూర్ల శంకర్, పోగుల సారంగపాణి, నీల గట్టయ్య, బ్రహ్మారెడ్డి, గుడి వంశీధర్ రెడ్డి,కొలిపాక సతీష్ నియోజకవర్గ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తది తరులు పాల్గొన్నారు.

# బిఎస్పీ నుండి బరిలో దిగిన ఇందు శ్రావణి

**స్టేషన్ ఘన్ పూర్/ ఫిబ్రవరి 3(జర్నలిస్ట్ వార్త) :** నేషనల్ పార్టీ బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) నుండి ఇందూ శ్రావణి ఎన్నికల బరిలో ఉన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రేపు జరగ బోయే ఎన్నికల్లో నేషనల్ పార్టీ అయిన బహుజన సమాజ్ పార్టీ( బిఎస్పి) నుండి ఎన్నికల బరిలో దిగడం గర్వంగా ఉందని అన్నారు.మన దేశ ప్రజా స్వామ్యంలో ప్రతి పౌరుడికి గౌరవం, హక్కులు, సమానత్వం అత్యంత ముఖ్యమైనవి. ఈ విలువ లను కార్యరూపంలోకి తీసుకురావడమే బీఎస్పీ యొక్క లక్ష్యమని, సమాజంలోని వెనుకబడిన వర్గాలు, మహిళలు,యువత,కార్మికులు, రైతులు మరియు అన్ని వర్గాల ప్రజల సమస్యలను ప్రభు త్వం దృష్టి కి తీసుకెళ్లడమే కాక ,పరిష్కార మార్గా లు చూపడం కూడా మా ముఖ్య ఉద్దేశమని అన్నారు.బీఎస్పీ అనేది



ఒక పార్టీ మాత్రమే కాదు, ఇది బడుగు బలహీన వర్గాల కోసం పోరాడే ఒక ఉద్యమం అని,సామాజికన్యాయం, సమానత్వం, స్వాభిమానం అనే సిద్ధాంతాలపై నిలబడిన పార్టీ అని అన్నారు. మనకు మార్గం చూపిన మాన్య శ్రీ కాన్షీరామ్ బాటలో నడిచి దేశరాజకీయాల్లో అత్యంత ముఖ్యమైన వ్యక్తిగానిలిచిన మాయావ తి చూపిన మార్గంలో మనం నడుస్తూ, మన జీవితాల్లో నిజమైన మార్పు తీసుకురావడానికి నేను కూడా వారి మార్గంలో నడుస్తూ వారి ఆశ యాలని కొనసాగించడానికి సిద్ధంగా ఉన్నానని అన్నారు. ఈ ప్రయాణంలో ప్రజల ఆశీర్వాదం, మద్దతు నాకు ఎంతో ముఖ్యమైనదని మీ ఒక్క ఓటు ఒక బలమైన సందేశం.మార్పు దిశగా ఒక ముందడుగు వేయాలని కోరారు.

# ధర్మసాగర్‌లో స్వయంకృషి కాలనీ రోడ్డు వివాదం వద్దు

### గ్రామాభివృద్ధిని అడ్డుకోవద్దు : వార్డు సభ్యుడు మేకల సాంబరాజు

**ధర్మసాగర్/ఫిబ్రవరి 3 (హనుమకొండ బ్యూరో): (జర్నలిస్ట్ వార్త)** ధర్మసాగర్ ప్రభుత్వ కళాశాల సమీపంలోని స్వయంకృషి కాలనీ రోడ్డు అంశంపై వాస్తవాలను విస్మరించి కొందరు అనవసర అపోహలు సృష్టిస్తున్నారని ధర్మసాగర్ మొదటి వార్డు సభ్యుడు మేకల సాంబరాజు తెలిపారు. ఈ రోడ్డు నిర్మాణం వల్ల కాలనీ వాసులకు ఎలాంటి నష్టం లేదని ఆయన స్పష్టం చేశారు.

ఈ అంశంపై సర్పంచ్‌తో పాటు వార్డు సభ్యులు కాలనీ వాసుల అభ్యంతరాలను తెలుసుకుని, వెంచర్ యజమానులను గ్రామపంచాయతీ కార్యాలయానికి పిలిపించి సమగ్రంగా చర్చలు జరిపినట్లు తెలిపారు. అనంతరం రోడ్డు స్థలాన్ని ప్రత్యక్షంగా పరిశీలించి, ఇంటి యజమానులు మరియు వెంచర్ యజమానులతో సంప్రదింపులు జరిపినట్లు పేర్కొన్నారు.

వెంచర్ యజమానులు తమ స్వంత ఖర్చులతో రోడ్డు నిర్మాణం చేపడతామని, గ్రామ ప్రజలందరూ నిర్బంధం లేకుండా నడిచేందుకు, రాకపోకలు సాగించేందుకు తమకు ఎలాంటి అభ్యంతరం లేదని గ్రామపంచాయతీకి లిఖితపూర్వకంగా ఉత్తరం ఇచ్చినట్లు తెలిపారు. నిబంధనల ప్రకారం ఒకసారి రోడ్డు ఏర్పడితే అది ప్రజలందరికీ ఉపయోగపడే ప్రజా మార్గమేనని వారు స్పష్టం చేసినట్లు వెల్లడించారు.

ఈ నేపథ్యంలో ధర్మసాగర్ గ్రామపంచాయతీ పాలకవర్గం తీర్మానం కూడా చేసినట్లు తెలిపారు. రోడ్డు నిర్మాణంలో కాలనీ పరిధిలోని ఎవరి ఒక్క సెంటు భూమి కూడా వినియోగించకూడదని స్పష్టంగా



నిర్ణయించామని, కొలతలు చేపట్టి పరిశీలించగా ఎవరికీ భూమి నష్టం జరగడం లేదని ఆయన వివరించారు.

చర్చల అనంతరం రోడ్డుకు ఇరువైపులా ఇండ్ల సరిహద్దుల నుండి ఎడమవైపు ఐదు అడుగులు (రెండు అడుగులు మంచినీటి పైపులైన్‌కు, మూడు అడుగులు సైడ్ డ్రైనేజీకి), కుడివైపు మూడు అడుగులు సైడ్ డ్రైనేజీకి వదిలి, మిగిలిన స్థలంలోనే రోడ్డు నిర్మించాలని నిర్ణయించినట్లు తెలిపారు. రోడ్డు నిర్మాణాన్ని వెంచర్ హద్దుల వరకు కాకుండా గంటే శ్రీనివాస్ ఇంటి వరకు చేపట్టాలని వెంచర్ యజమానులను కోరినట్లు చెప్పారు. అలాగే కళాశాల నుండి ధర్మసాగర్ మెయిన్ రోడ్ వరకు ఉన్న బీటీ రోడ్డును ఇరువైపులా విస్తరించి అభివృద్ధి చేయాలని సూచించినట్లు తెలిపారు. ఇందుకు వెంచర్ యజమానులు గ్రామపంచాయతీకి పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చినట్లు చెప్పారు. ఈ మేరకు గ్రామ సర్పంచ్, కార్యదర్శి, వార్డు సభ్యులు కలిసి భూమి పూజ నిర్వహించినట్లు తెలిపారు.

రోడ్డు నిర్మాణంలో కాలనీ వాసుల ఇంటి స్థలం నుండి అర అంగుళం కూడా తీసుకోవడం లేదని, పూర్తిగా డాక్యుమెంట్లలో ఉన్న కొలతల ప్రకారమే పనులు జరుగుతాయని ఆయన స్పష్టం చేశారు. అయితే కొందరు తమ డాక్యుమెంట్లు చూపించకుండా అనవసర సమస్యలు సృష్టించడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు.

వెంచర్ ద్వారా రోడ్డు నిర్మాణం జరగడం వల్ల గ్రామపంచాయతీకి రిజిస్ట్రేషన్ ద్వారా అదనపు ఆదాయం లభించడంతో పాటు విద్యుత్, డ్రైనేజీ వంటి మౌలిక వసతుల ద్వారా కూడా ఆదాయం సమకూరుతుందని తెలిపారు. గతంలో స్వయంకృషి కాలనీ సమస్యలపై వార్తలు వచ్చినప్పటికీ, ప్రస్తుతం అభివృద్ధి జరుగుతున్న సమయంలో అడ్డుకోవడం సరికాదని పేర్కొన్నారు.

అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని, గ్రామాభివృద్ధిని అడ్డుకునే ధోరణిని విడనాడాలని గ్రామ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. రోడ్డు అభివృద్ధి వల్ల ఎవరికైనా ఇబ్బందులు ఉంటే గ్రామపంచాయతీకి రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తే పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## 10వ తరగతి టాపర్లకు రూ. 2.2 కోట్లు బహుమతులు

### ; శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ కొత్త కార్యక్రమం

### 'మిషన్ 10వ తరగతి' పోస్టర్ ఆవిష్కరణ




**భీమదేవరపల్లి/ఫిబ్రవరి3 (జర్నలిస్ట్ వార్త):** ప్రభుత్వ పాఠశాలల ప్రతిభావంతులైన 10వ తరగతి విద్యార్థులను ప్రోత్సహించేందుకు శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థ 'మిషన్ 10వ తరగతి' కార్యక్రమాన్ని ప్రారంభించింది. మంగళవారం భీమదేవరపల్లి ఎంఇవో సునీత మిషన్10వ తరగతి పోస్టర్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా సునీత మాట్లాడుతూ, చదువుతోనే సమాజంలో మార్పు సాధ్యమని, ప్రతిభావంతులైన విద్యార్థులను గుర్తించి ప్రోత్సహించడం అవసరమని పేర్కొన్నారు. "ఇటువంటి కార్యక్రమాలు యువతలో చదువుకు ప్రేరణ ఇస్తాయి," అని ఆమె చెప్పారు. ఈ కార్యక్రమం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా మొత్తం రూ. 2.2 కోట్లు నగదు బహుమతులుగా విద్యార్థులకు అందజేయనున్నారు. మొదటి స్థానానికి ఐదు లక్షల రూపాయలు, రెండవ స్థానానికి మూడు లక్షల రూపాయలు, ప్రతి జిల్లా టాపర్‌కు రెండు లక్షల రూపాయలు, 119 నియోజకవర్గ టాపర్లకు ఒక్కొక్కరికి ఒక లక్ష రూపాయలు, 612 మండలాల్లో టాపర్లకు ఒక్కొక్కరికి పది వేల రూపాయలు బహుమతిగా అందిస్తారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, వరంగల్ డివిజనల్ మేనేజర్ వినయ్, వరంగల్ బ్రాంచ్ మేనేజర్ సురేష్ కుమార్, సాయిరాం, విద్యార్థులు పాల్గొన్నారు.

## కన్నుల పండుగగా శ్రీ వెంకటేశ్వర స్వామి ధోపోత్సవ వేడుకలు



**రాయపర్తి/ఫిబ్రవరి 3 (జర్నలిస్ట్ వార్త):**కోరికలను తీర్చే కొంగు బంగారమైన స్వయం వ్యక్త శ్రీ సన్నూరు శ్రీవెంకటేశ్వర స్వామి ధోపోత్సవ వేడుకలు మంగళవారం మండలంలోని వెంకటేశ్వర పల్లి గ్రామంలో అంగరంగ వైభవంగా జరుపబడ్డాయి. గ్రామస్తులు, ఆలయ అర్చకులు ఉత్సాహంగా పాల్గొని స్వామివారి ఉత్సవ విగ్రహాలను గజవాహనంపై ఊరేగింపగా ఊరేగించారు.భక్తులు స్వామివారిని ఎదురేగి మంగళ హారతులతో స్వాగతం పలికారు. కొబ్బరికాయలు కొట్టి, స్వామివారి దర్శనం పొందుతూ తమ కోరికలను స్వామి దయతో తీర్చుకున్నారు. ఈ వేడుకల వల్ల గ్రామంలో పండుగ వాతావరణం నెలకొని, భక్తుల ఉత్సాహం ఆకాశానికి చేరింది.ఆలయ ప్రాంగణంలో స్వామివారి సంకీర్తనలు, గోవింద నామస్మరణలతో భక్తిమరుగు సృష్టించబడింది. చుట్టుపక్కల గ్రామాల నుండి వచ్చిన భక్తులు, తండోపతండాలుగా తరలివచ్చి ఈ ధోపోత్సవాన్ని ఘనంగా తిలకించారు. గ్రామస్తులు స్వామివారి అనుగ్రహాన్ని పొందినందుకు సంతోషం వ్యక్తం చేశారు.వందలాది మంది భక్తుల సమక్షంలో జరిగిన ధోపోత్సవ వేడుకలు, గ్రామానికి ఆధ్యాత్మిక ఉత్సాహాన్ని తీసుకురావడంతో, వాతావరణం పూర్తిగా పండుగ మాధుర్యంతో నిండిపోయింది.

## మృతుని కుటుంబానికి సర్పంచ్ రాపాక పద్మబ్రహ్మాచారి బియ్యం అందజేత

**రాయపర్తి /ఫిబ్రవరి 3 (జర్నలిస్ట్ వార్త):** మండలంలోని కాట్రపల్లి గ్రామానికి చెందిన జంగిలి ఉప్పలయ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో, మంగళవారం సర్పంచ్ రాపాక పద్మబ్రహ్మాచారి మృతుని కుటుంబాన్ని పరామర్శించారు.ఈ సందర్భంగా 25 కేజీల బియ్యం మృతుని కుటుంబానికి అందజేయడం జరిగింది. సర్పంచ్ పద్మబ్రహ్మాచారి మాట్లాడుతూ, మృతుని కుటుంబాన్ని ఈ కష్ట సమయంలో



ఆదుకోవడం ప్రతి వ్యక్తి సామాజిక బాధ్యత అని తెలిపారు.కార్యక్రమంలో గ్రామస్థులు, సమీప గ్రామాల ప్రజలు పాల్గొని మృతుని కుటుంబానికి మనస్ఫూర్తిగా సహానుభూతి తెలిపారు. సర్పంచ్ వారి సూచనల మేరకు పంచాయతీకి చెందిన ఇతర సామాజిక సేవ కార్యక్రమాలు కూడా కొనసాగుతాయని వివరించారు.ఈ చర్య ద్వారా గ్రామ సమాజంలో మానవత్వం, సామాజిక బాధ్యతకు మంచి ఉదాహరణ సృష్టించబడిందని పేర్కొన్నారు.

## మానసిక దివ్యాంగుల మధ్య సుప్రజ జన్మదిన వేడుకలు



**మధిర / ఫిబ్రవరి 3 (జర్నలిస్ట్ వార్త):**మధిర నియోజకవర్గ పరిధిలోని నంద్రు సుందరావు, జ్యోతి దంపతుల కుమార్తె నంద్రు కోమలి సుప్రజ జన్మదినాన్ని పురస్కరించుకుని మధిరలోని మదర్ థెరిస్సా సేవాసదనం మానసిక దివ్యాంగుల పునరావాస కేంద్రంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ముందుగా కేక్ కటింగ్ చేసి, అనంతరం మానసిక దివ్యాంగులకు అన్న వితరణ చేశారు. సుప్రజకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో సంతోషంగా జీవించాలని, మంచి విద్యతో ఉన్నత స్థాయికి ఎదగాలని కేంద్రంలోని మానసిక దివ్యాంగ పిల్లల తరఫున ప్రార్థనలు చేశారు.ఈ అన్న వితరణ కార్యక్రమంలో సుందరావుతో పాటు ఆయనతోటి ఉపాధ్యాయులు, స్నేహితులు పాల్గొన్నారు. మానసిక దివ్యాంగ పిల్లలతో సుప్రజ జన్మదినాన్ని పంచుకొని అన్నదానం చేసినందుకు సుందరావు, జ్యోతి దంపతులకు నిర్వాహకులు హృదయపూర్వక ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలిపారు.

# ఫ్రూట్ కవర్స్‌పై 50 శాతం రాయితీ




**సత్తుపల్లి/ఫిబ్రవరి3 (జర్నలిస్ట్ వార్త):**తెలంగాణ ప్రభుత్వం మామిడి రైతులకు ఫ్రూట్ కవర్స్‌పై 50 శాతం రాయితీ అందిస్తున్నట్లు ఉద్యాన శాఖ అధికారులు తెలిపారు. మామిడి కాయలు నిమ్మకాయ సైజులో ఉన్న సమయంలో ఈ ఫ్రూట్ కవర్స్‌ను తొడిగితే కాయ నాణ్యత పెరగడంతో పాటు పురుగుల బెడద లేకుండా మంచి దిగుబడి సాధించవచ్చని పేర్కొన్నారు.ఒక ఎకరాకు సుమారు 8,000 ఫ్రూట్ కవర్స్ అవసరం అవుతాయని, గరిష్టంగా ఒక్క రైతుకు 5 ఎకరాల వరకు ప్రభుత్వం సబ్సిడీ అందిస్తుందని తెలిపారు.ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలనుకునే సత్తుపల్లి, వేంసూరు మండలాల రైతులు ఉద్యాన అధికారిని సంప్రదించాలని ఉద్యాన అధికారి జి. శ్రావణి కోరారు.వివరాలకుసంప్రదించవలసిన ఫోన్ నెంబర్: 8977714114

# గ్రామీణ వికాస్ బ్యాంక్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

**రాయపర్తి /ఫిబ్రవరి 3 (జర్నలిస్ట్ వార్త):**
తెలంగాణ గ్రామీణ వికాస్ బ్యాంక్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని బ్యాంక్ మేనేజర్ భూక్య హుస్సేన్ అన్నారు.ఈ సందర్భంగా మండలంలోని గట్టికల్, శివరామపురం గ్రామాలలో రైతులకు, మహిళలకు, యువకులకు, విద్యార్థులకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంలో ఆయన మాట్లాడుతూ, రైతులు తమ పంటకు సంబంధించి రుణాలను ఏడాదికి ఒకసారి పునరుద్ధరించుకుంటే కేవలం 7% వడ్డీ చెల్లించాల్సి ఉంటుందని, అదనంగా కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన మూడు శాతం వడ్డీ రాయితీ కూడా పొందవచ్చని వివరించారు.రైతులు వెంటనే బ్యాంకుకు వెళ్లి రీ న్యూవల్ చేసుకోవాలని, లేకపోతే అధిక వడ్డీ విధించబడుతుందని హెచ్చరించారు.మరియు సైబర్ నేరాల నుండి రక్షించుకోవడం కోసం ఖాతాదారులు ఆధార్ కార్డు నెంబర్, బ్యాంకు వివరాలు, ఓటీపీ లను



అపరిచిత వ్యక్తులకు చెప్పకూడదని సూచించారు.
ఇతర బ్యాంకులతో పోలిస్తే గ్రామీణ వికాస్ బ్యాంకు ఫిక్స్ డిపాజిట్లపై అధిక వడ్డీ ఇస్తుందని, వయోవృద్ధులకు అదనపు వడ్డీ కూడా లభిస్తుందని చెప్పారు. ఆన్లైన్ లావాదేవీల సమయంలో స్మార్ట్ ఫోన్ ఉపయోగించేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని సూచించారు.
ప్రైవేట్ బ్యాంకుల మోసాలను, గ్రామీణ బ్యాంకుల ప్రయోజనాలను కళాజాత ద్వారా వివరించారు.
ఈ కార్యక్రమంలో అకౌంటెంట్ సుమన్, క్యాషియర్ శైలజ, సబార్డినేట్ అంజి, గ్రామ సర్పంచులు చెవు హేమలత, శీల హేమలత రెడ్డి, సీసీ సుధాకర్, హైరిక్స్ బ్యాంకు మిత్రులు ఉబ్బని సింహాద్రి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# డీసీఎం వ్యాన్ ఢీకొని వ్యక్తి దుర్మరణం

**వైరా/ఫిబ్రవరి 4 (జర్నలిస్ట్ వార్త):** వైరా మండలం రెబ్బవరం గ్రామంలో బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో గుత్తా సత్యం అనే వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు.
గ్రామానికి చెందిన గుత్తా సత్యం గేదెల కాపరిగా జీవనం సాగిస్తూ, సాయంత్రం వేళ గేదెలను మేత నుంచి ఇంటికి తోలుకొని వస్తున్న సమయంలో, అతివేగంగా వచ్చిన డీసీఎం వ్యాన్ ఆయనను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సత్యం అక్కడికక్కడే మృతి చెందాడు.సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.



# నర్సంపేట మున్సిపాలిటీ ఎన్నికలు

## బీఆర్ఎస్ 30 మంది కౌన్సిలర్ అభ్యర్థుల జాబితా విడుదల

**నర్సంపేట /ఫిబ్రవరి 3 (జర్నలిస్ట్ వార్త):**
నర్సంపేట మున్సిపాలిటీ ఎన్నికలలో బీఆర్ఎస్ పార్టీ తరఫున పోటీ చేయనున్న 30 మంది కౌన్సిలర్ అభ్యర్థుల జాబితాను మాజీ శాసనసభ్యులు పెద్ది సుదర్శన్ రెడ్డి విడుదల చేశారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బీఆర్ఎస్ పార్టీ నాయకత్వం సుదీర్ఘంగా ఆలోచించి అన్ని సామాజిక వర్గాలకు సముచిత ప్రాతినిధ్యం కల్పించే విధంగా బలమైన అభ్యర్థులను ఎంపిక చేసిందని తెలిపారు. ఎన్నికల్లో తీవ్ర పోటీ ఉన్నప్పటికీ అభ్యర్థుల ఎంపిక ప్రక్రియకు సహకరించిన పార్టీ నాయకులు, పార్టీ శ్రేణులు, కార్యకర్తలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. టికెట్ దక్కని ఆశావాహులకు భవిష్యత్తులో పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.
పార్టీ శ్రేణులు అందరూ సమన్వయంతో పనిచేసి బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపు కోసం, కారు గుర్తు విజయానికి కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.
నర్సంపేట మున్సిపాలిటీ పరిధిలో బీఆర్ఎస్ పార్టీ తరఫున ఎంపికైన కౌన్సిలర్ అభ్యర్థులు ఇలా ఉన్నారు.



1వ వార్డు నుంచి కడారీ కవిత, 2వ వార్డు నుంచి గోలి అనిత, 3వ వార్డు నుంచి మండల కుమారస్వామి, 4వ వార్డు నుంచి బీరం నాగిరెడ్డి, 5వ వార్డు నుంచి బొడుగు సంధ్యారాణి, 6వ వార్డు నుంచి వేణుముద్దల శ్రీధర్ రెడ్డి, 7వ వార్డు నుంచి మోతే తిరుపతిరెడ్డి, 8వ వార్డు నుంచి పెండెం కళ్యాణి, 9వ వార్డు నుంచి రాయుడి కీర్తి, 10వ వార్డు నుంచి నాగిశెట్టి పద్మ ప్రసాద్, 11వ వార్డు నుంచి పెండ్యాల జ్యోతి, 12వ వార్డు నుంచి ఇస్లావత్ రజిత రాజన్న నాయక్, 13వ వార్డు నుంచి అంగోత్ సుధాకర్ లాల్, 14వ వార్డు నుంచి బుస శిరీష, 15వ వార్డు నుంచి మీరాల ఐలయ్య యాదవ్, 16వ వార్డు నుంచి బానోతు నవీన్ నాయక్, 17వ వార్డు నుంచి నల్లా మనోహర్ రెడ్డి, 18వ వార్డు నుంచి దొమ్మటి రమ్య, 19వ వార్డు నుంచి గాలి శ్రీనివాస్ యాదవ్, 20వ వార్డు నుంచి వాసం కరుణ, 21వ వార్డు నుంచి శివరాత్రి స్వామి, 22వ వార్డు నుంచి మాదాసి ప్రవీణ్, 23వ వార్డు నుంచి మంద రిషిత, 24వ వార్డు నుంచి పెండెం శివానంద్, 25వ వార్డు నుంచి నాడెం సునీత, 26వ వార్డు నుంచి మండల శ్రీదేవి, 27వ వార్డు నుంచి గిరగాని హైమావతి, 28వ వార్డు నుంచి చింతల రేఖా టార్జాన్, 29వ వార్డు నుంచి నాగెల్లి పద్మ, 30వ వార్డు నుంచి బండి ప్రవీణ్ కుమార్‌లను బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులుగా ప్రకటించింది.

# అగ్ర వర్ణ కబంధ హస్తాల్లో

# దళిత నియోజకవర్గం

## 666 ఓట్లున్నా దళితులకు దక్కని బీ-ఫామ్..

### మూడు ఓట్లకే పార్టీల గులాంగిరీ


**వర్ధన్నపేట/ఫిబ్రవరి 3 (జర్నలిస్ట్ వార్త):**
ప్రజాస్వామ్య వ్యవస్థలో రిజర్వ్‌డ్ నియోజకవర్గాల ఏర్పాటు వెనుక ఉన్న ఆశయం.అణగారిన వర్గాలకు రాజకీయ అధికారం కల్పించడం. వర్ధన్నపేట గడ్డపై రాజకీయ పార్టీల తీరు చూస్తుంటే, ఆ ఆశయం అట్టడుగున పడిపోయినట్లు కనిపిస్తోంది. అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా ఇక్కడ ఎమ్మెల్యేలు దళితులే కావచ్చు , పెత్తనం మాత్రం దొరల దేనని తాజా టికెట్ల కేటాయింపు నిరూపిస్తోంది. 903 ఓట్లు ఉన్న వార్డులో ఏకంగా 666 మంది దళిత ఓటర్లు ఉన్నప్పటికీ, కేవలం 3 ఓట్లు ఉన్న సామాజిక వర్గానికి బీ-ఫామ్ కట్టబెట్టడం అటు కాంగ్రెస్, ఇటు బీఆర్ఎస్ పార్టీల వివక్షకు పరాకాష్టగా మారింది.

### ఎమ్మెల్యేలు దళితులే.. నడిపించేది దొరలేనా?

ప్రస్తుత అధికార పార్టీ ఎమ్మెల్యే దళితుడే, గతంలో ఉన్న మాజీ ఎమ్మెల్యే కూడా దళితుడే, టికెట్ల పంపిణీ దగ్గరకు వచ్చేసరికి వీరెవరూ స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకోలేకపోతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అగ్రవర్ణ నేతలు గీసిన గీతను దాటలేక, తమ సొంత సామాజిక వర్గానికి జరుగుతున్న అన్యాయాన్ని కళ్లారా చూస్తూ కూడా మౌనంగా ఉండటం దళిత సమాజంలో ఆగ్రహాన్ని కలిగిస్తోంది. 70 శాతానికి పైగా దళిత ఓటర్లు ఉన్న చోట కూడా ఒక దళిత అభ్యర్థిని నిలబెట్టే ధైర్యం ఈ నేతలకు లేకపోవడం సిగ్గుచేటు. ఇది కేవలం రాజకీయ వ్యూహం కాదు, దళిత నాయకత్వాన్ని డమ్మీలుగా మార్చే కుతంత్రం.

### కాంగ్రెస్, బీఆర్ఎస్ ముసుగులో ఉన్నది ఒక్కటే నైజం...?

అటు కాంగ్రెస్, ఇటు బీఆర్ఎస్ రెండూ దళితుల ఓట్లతో గద్దెనెక్కాలని చూస్తాయి తప్ప, వారికి అధికారాన్ని పంచడానికి సిద్ధంగా లేవు. మెజారిటీ



ఓట్లున్న దళిత నాయకులను కేవలం ప్రచారానికి వాడుకుని, ఫలితం దగ్గరకు వచ్చేసరికి అగ్రవర్ణాల పాదాల దగ్గర బీ-ఫామ్స్ పడేస్తున్నారు. ఒక దళిత నాయకుడిని ఎదుర్కోవడానికి మరొక దళిత నాయకుడిని పావుగా వాడుతూ, అంతిమంగా దొరల పెత్తనాన్ని కొనసాగించే చీలిక - పాలన రాజకీయాలకు వర్ధన్నపేట వేదికవుతోంది. ఇది అణచివేతలో ఉన్న ఆధునిక రూపం.

### ఆత్మగౌరవంపై దాడి.. చైతన్యం అవసరం

మద్యం, డబ్బు ఎరగా చూపి దళిత ఓట్లను కొల్లగొట్టాలని చూస్తున్న పార్టీలకు బుద్ధి చెప్పాల్సిన బాధ్యత ఇప్పుడు దళిత సమాజంపై ఉంది. మా ఓటు మా రాజ్యాధికారం అనే దిశగా అడుగులు వేయాల్సిన సమయం వచ్చింది. తమ ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టే నాయకులకు, దొరల చేతిలో కీలుబొమ్మలుగా మారిన ప్రజాప్రతినిధులకు ఈ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలి. తమ వర్గ ప్రయోజనాలను కాపాడే నిజమైన నాయకత్వాన్ని ఎన్నుకోవడమే ఈ రాజకీయ వివక్షకు ఏకైక సమాధానం.రాజకీయ పార్టీలు సామాజిక న్యాయం పేరుతో చేస్తున్న వంచనను దళిత సమాజం గమనిస్తోంది. దళిత ఎమ్మెల్యేలు ఉన్నా సరే, అగ్రవర్ణ నేతల కనుసన్నల్లోనే నిర్ణయాలు సాగుతుండటం దళిత సాధికారతకు గొడ్డలిపెట్టు. మెజారిటీ ప్రజల ఆకాంక్షలకు విరుద్ధంగా జరుగుతున్న ఈ టికెట్ల కేటాయింపుపై దళిత సంఘాలు, మేధావులు గొంతెత్తాల్సిన అవసరం ఉంది.

### ఓట్ల లెక్కల్లో దళితులు..
### నోట్ల లెక్కల్లో దొరలు..?

రాజకీయ పార్టీలకు దళితులు కేవలం ఓట్లు వేసే యంత్రాలుగా, జెండాలు మోసే కూలీలుగానే కనిపిస్తున్నారు. ఎస్టీలు ఉన్నచోట ఎస్టీలకు, యాదవులు ఉన్నచోట యాదవులకు ప్రాధాన్యత ఇస్తున్నామని గొప్పలు చెప్పుకునే పార్టీలు, దళిత మెజారిటీ వార్డుకు వచ్చేసరికి దొరల ముందు ఎందుకు మోకరిల్లుతున్నాయి? 3 ఓట్లు ఉన్న వ్యక్తికి టికెట్ ఇవ్వడం వెనుక ఉన్న ఏకైక ప్రాతిపదిక ధనబలం ఆర్థికంగా బలంగా ఉన్నవారికే టికెట్లు ఇవ్వాలనే పార్టీల ధోరణి వల్ల, నిబద్ధత గల దళిత నాయకులు రాజకీయంగా సమాధి అవుతున్నారు. ఇది సామాజిక సమతుల్యతను దెబ్బతీసే కుట్రలో భాగమే.

# సచివాలయంలో ఫైర్ మాక్ డ్రిల్ నిర్వహణ



**హైదరాబాద్/ఫిబ్రవరి 3 (జర్నలిస్ట్ వార్త):**:డా. బి.ఆర్. అంబెడ్కర్ తెలంగాణా సచివాలయంలో ఉదయం ఫైర్ మాక్ డ్రిల్ల్ ను నిర్వహించారు. ప్రమాద వశాత్తు ఏదైనా అగ్ని ప్రమాదం జరిగితే వెంటనే చేపట్టాల్సిన చర్యలు, అగ్ని మాపక పరికరాలను ఏవిధంగా ఉపయోగించాలి తదితర అంశాలపై నేడు ఉదయం చేసిన మోక్ డ్రిల్ లో వివరించారు. సచివాలయం సీఎస్ఓ దేవీ దాస్, అసిస్టెంట్ కమాండెంట్స్ అప్పాజీ, పవన్ కుమార్, ఏ.డి.ఎఫ్.ఓ జీ.వి. ప్రసాద్, ఎస్.ఎఫ్.ఓ జాన్యా లతోపాటు సచివాలయానికి చెందిన దాదాపు 100 టీ,జి.ఎస్.పి.ఎఫ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

-----------

# వరంగల్ జూలో తెల్లపులి మృతి

## వృద్ధాప్యం కారణమని తెలిపిన అధికారులు

వరంగల్,**/ఫిబ్రవరి 3 (జర్నలిస్ట్ వార్త):**
నగరంలోని హంటర్ రోడ్డు కాకతీయ జూలజికల్ పార్క్ లో వైట్ టైగర్ (శరణ్) మంగళవారం తెల్లవారుజామున ఎక్లోజర్ లో చనిపోయింది. వృద్ధాప్యం, మల్టీ ఆర్గాన్ ఫెల్యూర్ తో చనిపోయిందని జూ అధికారులు అంటున్నారు. మంగళవారం పులి అంత్యక్రియలు చేసినట్లు జూపార్క్ పర్యవేక్షణ అధికారి మయూరి తెలిపారు.



అయితే అధికారుల మెంటనెన్స్ సరిగా లేకనే రెండు రోజులుగా అనారోగ్యానికి గురై చనిపోయినట్లు తెలుస్తోంది. హైదరాబాద్ జూ పార్క్ నుంచి తెల్ల పులిని జూలై మాసంలో వరంగల్ తీసుకొచ్చారు. పులి సంరక్షణ సరిగా లేకనే అనారోగ్యానికి గురై మృత్యు వాత పడినట్లు సమాచారం. అధికారులు మాత్రం పులి అనారోగ్యం, గుండె పోటుతో చనిపోయిందని చెబుతున్నారు. జిల్లా అధికారులు పులి మృతి విషయం గోప్యన్గా ఉంచి, అంత్యక్రియల తరువాతనే అనారోగ్యంతో మృతి చెందినదని జూ అధికారి చెప్పడం గమనార్హం.

# నేడు తెలంగాణ వెనుకబడిన తరగతుల కమిషన్ భేటీ

హైదరాబాద్,**ఫిబ్రవరి 3 (జర్నలిస్ట్ వార్త):**వెనుకబడిన తరగతుల సమగ్ర అధ్యయనంలో భాగంగా వివిధ ప్రభుత్వ విభాగాల నుండి బీసీ కమిషన్ సమాచార సేకరణ చేస్తుంది. ఇందులో భాగంగా విద్యా సంబంధిత విషయంలో సమాచార సేకరణ కొరకై సంబంధిత విభాగ అధిపతులతో రేపు కమిషన్ భేటి కానుంది. బుధవారం మధ్యాహ్నం 12:00 గంటలకు జరిగే సమావేశంలో విద్యాశాఖకు చెందిన వివిధ విభాగ అధిపతులను ఈ సమావేశానికి హాజరు కావాలని కోరడం జరిగింది. ఈ సమావేశంలో విద్యార్థుల వివరాల సేకరణకు సంబంధించిన అంశాలపై కమిషన్ చర్చించనుంది.